క్లుప్తంగా

కోడి పందేలు ఆడుతున్న నలుగురి అరెస్టు

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరంలో కోడి పందేల శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై రామలింగేశ్వరరావు బుధవారం తెలిపారు. జె.అన్నవరంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారని ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రెండు కోడిపుంజులు, రూ.640 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

గండేపల్లి: మండలంలోని సింగరంపాలెంలో బుధవారం మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై యువి శివనాగబాబు తెలిపారు. సింగరంపాలెం గ్రామ శివారులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 14 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

వైస్ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ



రాచపల్లిలో వీరరాఘవరావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న యనమల కృష్ణుడు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను (బంకు శ్రీను) కుటుంబాన్ని బుధవారం వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు పరామర్శించారు. బంకు శ్రీను తండ్రి వీరరాఘవరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో యనమల కృష్ణుడు బంకు శ్రీను కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీరరాఘవరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రామిశెట్టి బులిరామకృష్ణ, సర్పంచులు గొనగాల అప్పలరాజు, నడిగట్ల త్రిమూర్తులు, ఎంపీటీసీ తటవర్తి రామన్నదొర, పార్టీ నాయకులు గొల్లపల్లి దొరబాబు, చిన్నా, చింతల రాజు, పెదిరెడ్డి నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

జగ్గంపేట: మండలంలోని మల్లిశాల గ్రామ శివారులో సారా బట్టీలపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్సై రఘునాథరావు తెలిపారు. సారా తయారీకి పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

20న బీకేఎస్ జిల్లా మహాసభ

ప్రత్తిపాడు: స్థానిక లయన్స్‌క్లబ్ కల్యాణ మండపంలో ఈ నెల 20న భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) జిల్లా మహాసభను నిర్వహించనున్నట్టు బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా బుధవారం తెలిపారు. ఈ మహాసభలో ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. రైతు సమస్యల పరిష్కారానికి ఉద్యమ ప్రణాళికను రూపొందిస్తారని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణ అధ్యక్షతన జరిగే ఈ మహాసభకు బీకేఎస్ అఖిల భారత కార్యవర్గ సభ్యుడు జలగం కుమార స్వామి, బీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పరిమి వెంకట రాఘవులు, బీకేఎస్ రాష్ట్ర ప్రతినిధులు ఎం.శ్రీధర్‌రెడ్డి, యల్లపు సూర్యనారాయణ, కె.పతిరాజు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాటర్ ట్యాంకు ప్రారంభం



ఏవీ నగరంలో మంచినీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే యనమల దివ్య బుధవారం ప్రారంభించారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.1.10 లక్షలతో ఈ ట్యాంకును నిర్మించారు. అరబిందో సేవలను స్థానికులు కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

గండేపల్లి: మినుము పంటను ఆశించే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ఏఓ సద్గురుమూర్తి సూచించారు. గండేపల్లిలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినుము పంట పూత దశలో ఉన్నప్పుడు పంటను మచ్చల పురుగు ఆశించి నష్టాన్ని కలగజేస్తుందన్నారు. మచ్చల పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ ఉదయ్, రైతులు పాల్గొన్నారు.



తీరంలో ఇటీవల పునర్నిర్మించిన కామాక్షి అమ్మవారి ఆలయం ఇన్‌సెట్‌లో (కామాక్షి అమ్మవారు)



తీరంలో నిర్మించిన సాయిబాబా ఆలయం



తొండంగి మండలం దానవాయిపేట బీచ్‌లో పర్యాటకుల సందడి

తీరం.. పర్యాటక హారం

- దానవాయిపేట తీరానికి పర్యాటకుల తాకిడి
- పలు ఆలయాల నిర్మాణంతో పెరిగిన రద్దీ
- సౌకర్యాలు కల్పిస్తే మరింత అభివృద్ధి

తొండంగి: మండలంలోని దానవాయిపేట సాగర తీరం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. కడలి సోయగాలను వీక్షించేందుకు వస్తున్న వేలాది మంది పర్యాటకులతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటోంది. అన్నవరం పుణ్యక్షేత్రం దానవాయిపేట తీరానికి సమీపంలో ఉండటంతో కడలి అందాలను చూసేందుకు దూరప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు వస్తున్నారు. కాగా తీరంలో సౌకర్యాల లేమి కారణంగా పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.

బీచ్ రోడ్డులో సుందరంగా ఆలయాల నిర్మాణం

మండలంలోని అద్దరిపేట, యర్రయ్యపేట, జీఎంపేట, కొత్తపేట, అన్నయ్యపేట, పంపాదిపేట, దానవాయిపేట, తాటియాకులపాలెం, వాకదారిపేట, పెరుమాళ్లపురం, కొత్తచోడిపల్లిపేట తదితర గ్రామాల్లో సముద్ర తీరప్రాంతాలు ఉన్నాయి. ముఖ్యంగా దానవాయిపేట గ్రామం నుంచి సముద్రతీరానికి వెళ్లే రహదారిలో సాయిబాబా, వేంకటేశ్వరస్వామి, దుర్గామాత ఆలయాలను ఇప్పటికే నిర్మించారు. కామాక్షి అమ్మవారి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో సుమారు రూ.25 లక్షలతో ఇటీవల కాలంలో ఆ ఆలయాన్ని తొలగించి నూతన ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ రోడ్డులో గ్రామదేవతల ఆలయాలు కూడా నిర్మించారు.

రూ.80 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

తీరానికి మణిహారంగా ఉన్న సముద్రాన్ని చేరుకునేందుకు గత ప్రభుత్వ హయాంలో తీరాన్ని ఆనుకుని ఉన్న అన్ని గ్రామాల్లోనూ కిలోమీటరు చొప్పున అద్దరిపేట నుంచి కొత్తచోడిపల్లిపేట వరకూ సీసీరోడ్లు నిర్మించారు. దానవాయిపేట తీరానికి వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా పర్యాటకుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని దానవాయిపేట సముద్ర తీరానికి చేరుకునేందుకు ప్రభుత్వ, దాతల సహకారంతో రూ.80 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు. దీంతో తీరానికి పర్యాటకుల వాహనాలు సునాయాసంగా చేరుకుంటున్నాయి. కాగా పర్వదినాలు, శ్రావణమాసం, మాఘ, కార్తిక మాసాల్లో భక్తులు అధిక సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు సముద్ర తీరానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో స్త్రీలు దుస్తులు మార్చుకునేందుకు గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.



దానవాయిపేట తీరంలో పార్కింగ్ చేసిన పర్యాటకుల వాహనాలు



దానవాయిపేట బీచ్‌కు నడిచి, వాహనాలపై వస్తున్న భక్తులు

సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నాం



దానవాయిపేట సముద్ర తీరానికి ఏటా పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. వారి కోసం ఇప్పటికే సీసీ రోడ్లు నిర్మించాం. మరుగుదొడ్లు, సెంట్రల్ లైటింగ్, స్త్రీల వస్త్రాలు మార్చుకునేందుకు షెడ్లు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. దీనిపై గ్రామసభలో చర్చించి తీర్మానించాం. తీరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నాం.

–మదదా తిరుమల సత్యకుమారి, సర్పంచ్, దానవాయిపేట

చూసిన కనులకు వైభోగం



ఊరేగింపులో చిన్నారుల కోలాట ప్రదర్శన



గోకవరంలో పూలరథంపై దేవీచౌక్ కనకదుర్గమ్మ ఊరేగింపు

- వైభవంగా దేవీచౌక్ కనకదుర్గమ్మ ఊరేగింపు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ ఊరేగింపు బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కన్నులపండువగా ఊరేగింపు నిర్వహించారు. పూలరథంపై అమ్మవారిని ఉంచి భక్తులు తాళ్లతో లాగారు. తీన్‌మార్, డీజే నృత్యాలు, కాంతారా డ్యాన్సులు, అమ్మవారి గరగలు, వివిధ దేవతల వేషధారణలు, బాణసంచా కాల్పుల నడుమ ఆద్యంతం వైభవంగా ఊరేగింపు సాగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గుర్రాలు చేసిన నృత్యాలు, బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు గ్రామంలో ప్రధాన రహదారి గుండా తెల్లవారుజాము వరకు సాగింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై పవన్‌కుమార్ భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన రైల్వే సేఫ్టీ ఆఫీసర్

అన్నవరం: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ చీఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ కె. వేంకటరమణారెడ్డి బుధవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేసి సత్యదేవుని ప్రసాదాలు బహూకరించారు. ఆయన వెంట పలువురు రైల్వే అధికారులు ఉన్నారు.



సత్యదేవుని సన్నిధిలో వెంకటరమణారెడ్డి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గిడజాంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు

రౌతులపూడి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు అన్నారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు మండలంలోని గిడజాంలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలతో పాటు రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలపై ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా, ఓటీపీ వివరాలు అడిగితే చెప్పరాదని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. పొలాలు, అడవుల్లో జంతువుల కోసం అక్రమంగా కరెంట్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రౌతులపూడి ఎస్‌ఐ వెంకటేశ్వరరావు, ఏఎస్‌ఐ రమణ, పోలీసులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

రౌతులపూడి: బంగారయ్యపేట శివారులో పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు రౌతులపూడి ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ. 10,520, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని వివరించారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న చాన్సలర్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థిని జి.పుష్యమినాగసాయి సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ చదువుతున్న నాగసాయి గుంటూరు జిల్లా నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే 35వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. పలువురు అధ్యాపకులు నాగసాయికి అభినందనలు తెలిపారు.

‘యూనివర్సిటీ ఆఫ్ సౌత్ కరోలినా’తో ఆదిత్య ఒప్పందం

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థలు యూనివర్సిటీ ఆఫ్ సౌత్ కరోలినా అప్‌స్టేట్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నట్టు ఆ విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి బుధవారం తెలిపారు. విద్య, పరిశోధన, సాంస్కృతిక మార్పిడిలో అంతర్జాతీయ సహకారం పెంపొందించే లక్ష్యంతో యూఎస్‌ఏలోని స్పార్టన్‌బర్గ్ యూనివర్సిటీ ఆఫ్ సౌత్ కరోలినా అప్‌స్టేట్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. రెండు విశ్వవిద్యాలయాల మధ్య ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు, ద్వంద్వ డిగ్రీ సమర్పణలు, జంట కార్యక్రమాలు, అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమాలతో పాటు విద్యాపరమైన సహకారాన్ని మెరుగుపరచడం, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు ప్రోత్సహించడానికి ఈ ఒప్పందం తోడ్పడుతుందని వివరించారు. రెండు విశ్వవిద్యాలయాలకు చెందిన నాయకత్వ బృందాలు పాల్గొని ఒప్పందంపై సంతకాలు చేసుకున్నాయి. కార్యక్రమంలో చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి, ఎంటీ శ్రీనివాస్, ఎస్.రమాశ్రీ, జి.సురేష్, పీఎస్ రంజిత్ పాల్గొన్నారు.



ఒప్పందం కుదుర్చుకుంటున్న రెండు విశ్వవిద్యాలయాల అధికారులు

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



సిరిపురంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



మురారిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ఏలేశ్వరం/ప్రత్తిపాడు రూరల్ : గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. ఏలేశ్వరం మండలంలోని సిరిపురం, పేరవరం, భద్రవరం, లింగంపర్తి, ప్రత్తిపాడు మండలంలోని చింతలూరు, యాజీ పురం, వెంకటనగరం గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ఆయా గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జ్యోతుల పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గండేపల్లి: పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మురారి, గండేపల్లి, మల్లేపల్లి, సుబ్బయమ్మపేట, ఉప్పలపాడులో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్‌తో కలిసి ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, సర్పంచ్ కందుల చిట్టిబాబు, మాజీ వైస్ ఎంపీపీ పోతుల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు...

కోటనందూరు: మండల పరిధిలోని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా భీమవరపుకోటలో బుధవారం సీసీ రోడ్ల నిర్మాణానికి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర సత్యన్నారాయణతో కలిసి ఆయన శంకుస్థాపన చేసారు.

వర్షంతో ఉపశమనం

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం ఉక్కపోతగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై బెండపూడి, గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేదతీరారు. అల్పపీడనం వాయుగుండం, తుపానుగా మారనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

సేంద్రియ సాగు..లాభాలు బాగు

- రైతులకు ప్రకృతి సాగుపై అవగాహన
- గ్రామాల్లో జోరుగా పొలం పిలుస్తోంది కార్యక్రమాలు

కోటనందూరు: సేంద్రియ సేద్యంతో మంచి ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కొత్తకొట్టాంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ వరి, ఉద్యాన పంటల్లో సేంద్రియ విధానాలు అవలంభించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చన్నారు. సేంద్రియ వ్యవసాయం చేయడం వల్ల ఆరోగ్యవంతమైన ఉత్పత్తులతో పాటు నిస్సారమైపోతున్న పంటపొలాలను కాపాడుకోవచ్చన్నారు. అనంతరం రైతులతో కలిసి వరిపంట పొలాలను పరిశీలించారు. సేంద్రియ ఎరువులు, పురుగుమందుల తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాండవ ఏఈ దుర్గబాబు, ఏఈఓ కేవీ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యంతో అధిక దిగుబడులు

తుని రూరల్: వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బి.అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని ఎస్.అన్నవరం, రాజుపేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటకు ఎండు తెగులు సోకే అవకాశం ఉందన్నారు. నివారణకు యూరియా వాడకం తగ్గించాలన్నారు. ఎకరానికి పది కిలోలు పొటాష్ వేయాలన్నారు. సుడోమొనస్ కిలో చొప్పున పిచికారీ చేయాలన్నారు. పంటల నమోదు, ఈ–కేవైసీ తప్పనిసరి అన్నారు. వ్యవసాయ సహాయకులు బ్రహ్మానాయుడు, రాజేష్, రైతులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంతో అధిక లాభాలు

శంఖవరం: రైతులు సమీకృత వ్యవసాయం చేయడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కత్తిపూడిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీకృత వ్యవసాయం ద్వారా రైతులు ఒకేచోట అన్ని రకాల పంటలు పండించవచ్చన్నారు. సమీకృత వ్యవసాయంలో ఒక పంటకు నష్టం వాటిల్లితే మరో పంటలో అధిక దిగుబడి రావడానికి అవకాశం ఉందన్నారు. తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎస్.బుల్లిబాబు, ఉద్యానశాఖాధికారి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకొట్టాంలో సేంద్రియ ఎరువు తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



కత్తిపూడిలో రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

ప్రత్తిపాడు: గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు కోరారు. ఇటీవల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన సత్యానందరావు బుధవారం సాయంత్రం తొలిసారిగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి వచ్చారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. నిత్యావసరాల ధరలను నియంత్రించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని పటిష్టపరచాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. అనంతరం ఆయనను పార్టీ శ్రేణులు సత్కరించారు. పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ సత్యనారాయణ, పార్టీ నాయకులు కొప్పన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో డీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పాఠశాలలో డీవైఈఓ తనిఖీలు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను రాజమహేంద్రవరం డీవైఈఓ నారాయణ బుధవారం సందర్శించారు. పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. పాఠశాలలోని ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నాడన్న ఆరోపణలపై డీవైఈఓ పాఠశాలను సందర్శించి విచారణ నిర్వహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు ఎటువంటి వివరాలు వెల్లడించలేదు.